# సెనాపతి వీరన్న

'వీరన్న పోయాడు సుమీ...''

ఇంటికి వెళ్ళిన మరునాడు పొద్దున్న, గత రాత్రి రెండుజాముల వరకూ చెప్పుకున్నా తరగని విశేషాలు మాట్లాడుకుంటుంటే, అట్లాంటి సందర్భాల్లో సహజంగా సంఘటిల్లే కొన్ని మూగ నిముషాల తరువాత అన్నది అమ్మ.

నేను అంతరాంతరాల్లో తుళ్ళిపడ్డాను. అయినా ఆ పాటు బయటకు కానవచ్చే అంత తీవ్రమై ఉండదు. ఆమె అన్నది–

"పదిహేను రోజులయ్యింది – అప్పుడే పోయి!..." అంటూ అర్థోక్తిలో ఆగిపోయింది.

గతనాళ్ళ అమ్మ వినిపించిన మరణవార్తలు నెమరుకు రాగా తత్సమయాల పొందిన చిత్రానుభూతుల పునరనుభూతిని మరల పొందుతూ తక్కిన శేష చరిత్రులతో పాటు వీరన్నను కూడా మానసిక ప్రతిబింబంగా మొదటిసారి చూడసాగాను. అమ్మ అన్నది–

"అలాంటి వాళ్ళకు సాధారణంగా ఎలాంటి చావు వస్తుందని పెద్దలు చెపుతారో సరిగా అలాటి చావే వచ్చింది".

ఆమె చెపుతున్న విషయాలు ఒక వంక వింటూనే, ఏటేటా ప్రతి మూడు నాలుగు నెలలకూ మా ఊరు వెళ్ళినప్పుడల్లా ఆమె ఎవరిదో ఎక్కడిదో ఒక మరణ వార్త వినిపించటం, ఊరు కూడా ప్రతిసారీ ఏవేవో కొత్త కొత్త మార్పులు పొందుతూ పాత జ్ఞాపకాల నుండి దూరమవు తున్నట్టు తోచడం, నా పరిచితులు – వయసులో నాతో సమానులూ, చిన్నలూ, పెద్దలూ కూడా అకస్మాత్తుగా మాయమవుతూండటం జ్ఞాపకం తెచ్చుకుంటున్నాను.

స్త్రీ సహజమైన ధోరణిలో అలాంటి వాళ్ళకు ఎలాంటి చావు వస్తుందని పెద్దలు సూత్రీకరించారో అక్షరాలా అలాటి చావే అతడికి కూడా యెలా వచ్చిందో వర్ణించి చివరకు తన అభిప్రాయాలు చేర్చి ముగించింది.

ఆమె ధోరణి మొదట మొదట యెలా ఉన్నా చివరకు వచ్చేసరికి కరిగి వెల్లువ అయ్యే ఆమె స్త్రీ హృదయపు హోరును వినిపించసాగింది.

"– అయితే ఒక్కమాట చెప్పుకోవాలి. వాడు బతికి ఉన్నంతకాలం వాడిని ఏమన్నా, ఎలా చూసినా, ఏం చేసినా, చచ్చిపోయాక అందులోనూ దక్షతలేని ఆ ఇద్దరాడ కూతుళ్ళూ, అయిదుగురు పిల్లలూ అలో లక్షణా అని మొత్తుకుంటున్నది చూసైనా, వాళ్ళు – ఆదుకోవలసింది. చుట్ట–పక్కాలూ, ఇరుగు – పొరుగులూ, ఏక కులస్థులూ అనే వాళ్ళెందుకు చెప్పు! మరి – చెరువులు కావడానికి వాళ్ళకు గుండెలేలేవో, ఉన్నా – ముట్టుకుంటే అంటుకుంటే తమ మీదికేం వస్తుందో అని జడిసి మానేశారో తెలియదు. అందరూ యెవరిమట్టుక వారే ముఖాలు చాటేసుకున్నారు. ఇరుగూ పొరుగులైతే ఏకం తలుపులు తాళాలేసుకుని ఏవో పనులున్నట్టు యీ వీధీ, ఆ వీధీ వెళ్ళిపోయారు. తక్కిన కులాల వాళ్ళయినా అదేమంత్రా మీకొచ్చిన పోయేకాలం అనలేదు. అంతా జరిగిపోయాక అందరూ వచ్చారు. అంతా చేశారు. ఎందుకూ – దండగ!"

– అంటూ క్షణకాలం ఆగి అన్నది.

"ఆ ఆడకూతురు గుండె ఎంత మండిందో! జామున్నర పొద్దువరకూ వాళ్ళొస్తారో వీళ్ళొస్తారో అని యెదురు చూసి చూసీ ఎవ్వరూ రాకపోయే సరికి – అడ్డంగా వీధినిపడి ఊరు ఊరందర్నీ తిట్టిపోసింది. ఏడ్చి ఏడ్చి వాచిపోయిన మొహంతో చేతులు తిప్పుకుంటూ దీర్ఘాలుతీస్తూ దండాలు పెడుతూ – తండ్రీ! సూర్యనారాయణమూర్తీ! భగవంతుడా! నువ్వన్న వాడివి లేవా? ఉండి ఇదంతా చూస్తూ ఊరుకుంటావా? ఈ ఊరివాళ్ళు మనుషులేనా? వాళ్ళకూ మాకు పట్టిన గతులు పట్టవా? పుట్టెడు దుఃఖంలో వున్న మా మీద ఇంకా కక్షలు సాధిస్తూ వున్న వీళ్ళను సహిస్తావా? వీళ్ళకు శిక్షలుండవా? – అంటూ శాపాలు పెడుతూ వుంటే, నిజంగా అది జాలో భయమో నేనైతే చెప్పలేను, నాకాళ్ళల్లోంచీ ఒణుకు పుచ్చుకున్నది. వాకిట నించొని వింటున్న దాని నల్లా తరిమినట్టు ఇంట్లోకొచ్చి పడ్డాను–"

ఆమె అట్లా ఆనాడు జరిగినదంతా చెప్పుకుంటూ పోయింది.

అంత తతంగం జరిగాక కూడా కులస్థులెవ్వరూ ముందుకు రాకపోతే, ఆ ఆడ వాళ్ళిద్దరే శవాన్ని మోసుకు పోడానికి సిద్ధపడగా, అప్పుడు కొందరు ఇతరజాతి పెద్దలలో మనుష్యత్వం మేలుకొన్నదట. చాస్! వాళ్ళా! వీళ్ళా? మీకు బుద్ధులున్నాయా? మీరు మనుష్యులేనా? మమ్మల్ని ముట్టుకో మంటారా – మీ జాతివాళ్ళు ముందుకొస్తారా? – అంటూ వాళ్ళు హడావుడి చేస్తే సాటివారు ఎక్కడెక్కణ్ణుండో దిగబడి దహన సంస్కారాలు పూర్తయ్యాయని పించారట.

ఇందులో ఆశ్చర్యకరమైన విషయమేమీ లేదు. మనం సాధారణంగా గ్రామాలూ, గ్రామీణులూ స్వర్గ ఖండాలూ, దేవతలూగా అభివర్ణింపబడటం చూస్తాం. పోక పోక ఒకనాడు పల్లెకిపోయి చూసివచ్చిన వారి సహృదయోప న్యాసాలు – అవన్నీ. గ్రామాలు పట్టణాలకు ఏవిధంగానూ తీసిపోవు. క్రౌర్యం, దౌర్జన్యం, అత్యాచారం, దగా, యీర్ష్యాసూయలూ, నైచ్యం, అవినీతి, అసత్యం, వ్యభిచారం, భీరుత్వం – ఒకటేమిటి – మానవ జీవితంలో ఏహ్యమైనవీ, దూష్యమైనవీ, అవాంఛనీయమైనవీ అని వేని వేనిని గర్హిస్తామో అవన్నీఅక్కడ కూడా కానవస్తాయి. కాకపోతే అజ్ఞానం, అమాయకత్వం

అనే ముసుగుల్లో మన పెద్దలు వానిని దాచి చూపుతుంటారు. కనీసం ఇది నా అభిప్రాయం.

అందుచేతే వీరన్న చరమ యాత్రను గూర్చిన కథనంలో ఊరి వారి ధోరణి నాలో ఆశ్చర్యాన్ని గాని, జుగుప్సను గాని కలిగించలేదు.

పోతే వీరన్న కోసరం మాత్రం నా గుండె కలవరించి, ఆరోజల్లా చనిపోయిన వీరన్నా, బతికి ఉన్న వీరన్నా, ఉండీ ఉడిగీ జ్ఞాపకం వస్తూనే వచ్చారు. ముఖ్యంగా రాత్రి మంచం మీదకు చేరుకున్నాక ఆ నా పెద్ద గదిలో కళ్ళు మూసుకొని నిద్రపట్టక మంచంపై వెల్లకిలా పడి ఉన్న స్థితిలో – సన్నగా రివటల్లే, కమ్మెచ్చున తీసినట్టు కనిపించే కండరాలతో, పొడుగ్గా, ఎర్రని పెద్ద కళ్ళతో, పలచని మీసంతో, నవ్వుతూ, వాదిస్తూ, పౌరుషపడుతూ, నా పక్కను, నాకెదురుగా, నాచుట్టూ, నాపైన, ఆ వీధుల్లో, అక్కడెక్కడో చావుదెబ్బలు తిన్న నాటి రాత్రి మీదవడ్డ వారితో పోట్లాడుతూ, రోజుకుంటూ, బాధతో విలవిల్లాడుతూ, మూలుగుతూ, మరణిస్తూ చేతిలో కర్రతో, తన వూరి యింట్లో మంచంమీద ఆరిపోయిన పొగచుట్టతో, బాణాతిప్పుతూ, ఒకప్పుడు గిరజాలుగా ఉండి ముడికి పెరిగిన జుట్టు ముడివేస్తూ తొలిసారి నేను వీరన్నను గుర్తించిన గరిడీలో అసిరినాయుని ఊపిరాడనీయకుండా తరుముతూ, వివిధావస్థలలో, వివిధ స్థలాల్లో ఎక్కడ చూసినా తానుగా కనిపిస్తూ వచ్చాడు. ఆ రాత్రల్లా నాకు అతడి కలలే! భయంకరమైన కలలు!!

★ ★ ★

దురదృష్ట జీవి! వీరన్న పోయాడు!!

★ ★ ★

వీరన్న నిజంగా దురదృష్టజీవి! శుష్కమైనదే కావచ్చు – నా సానుభూతిని అపారంగా చూరగొన్న వారిలో వీరన్న ప్రథముడు.

నిజానికి వీరన్నకూ నాకూ లౌకికమైనవి కాని పారలౌకికమైనవి కాని ఎట్టి సంబంధాలూ లేవు. కులం చేతగాని, వయసు చేతగాని, వృత్తి చేతగాని మా యిద్దరికీ ఎట్టి సాన్నిహిత్యం లేదు. అతడిని నేనెరిగి ఉన్న యీ ఇరవై అయిదేళ్ళ కాలంలో అతడూ నేనూ ఒక్కసారి కూడా మాట్లాడుకొనైనా ఉండం.

అట్లా అని – ఏ సంబంధమూ లేదనటానికీ వల్లకాదు. నా మానసిక రజతపటలం మీద నేను ప్రదర్శించుకునే చిత్ర జగత్తులో వీరరస ప్రసక్తి గల ప్రతి చిత్రంలోనూ మహావీర పాత్రను ధరించేది యీ వీరన్నే! అతడు నా మేఘనాధుడు, అతడు నా కర్ణుడు! – అతడు నా గన్నారెడ్డి, అతడు నా ప్రతాప వర్మ. అతడే నా మార్తాండుడు! ఇదీ అతనికీ నాకూ గల సంబంధం!

ఇతడిని నా అంతరంగిక చిత్రజగత్తులో యీ విధమైన పాత్రధారిగా తీసుకొన్నది పాతికేళ్ళ కిందట సంఘటిల్లిన ఒక సన్నివేశంతో.

జీవితంలో పరాయి వ్యక్తులతో ఏర్పడే సంబంధాలన్నీ ఎట్లా ఒక సన్నివేశంతోఆరంభమవుతాయో అట్లానే ఇదీ ఏర్పడ్డది. నాకప్పటికి బహుశా పన్నెండు సంవత్సరాల వయసై ఉండాలి. ఆ ఏడాది గ్రామ దేవత పండగలలో గరిడీ ప్రదర్శనం వద్ద అతడిని నేను మొట్టమొదటి సారిగా చూసినట్టు జ్ఞాపకం.

విషయాలు అంత స్పష్టంగా గుర్తు లేవు. తక్కిన రోజుల్లో సాధారణంగా నజ్జు నజ్జుగా ఉండే గ్రామీణ వాతావరణం నాడు చాలా ఉద్రిక్త స్థితిలో ఉన్నట్టు జ్ఞాపకం. అరిసెలు మొదలైన పిండివంటల కమ్మని వాసనల వెనక, కొత్తదుస్తులు చుట్టుపక్కాల తళుకుల వెనక, పేకాటలూ నవ్వులూ మేకపోతుల వెనక – ఏదో అపాయం, అనూహ్య అప్రియ సంఘటన జరిగే సూచన – కనిపిస్తూ వచ్చినట్టు గుర్తు. లేక అది యీనాటి జ్ఞాపకం వల్ల కలిగే భ్రమో – ఏమైనా – ఆనాడు నేను సంబరంలోకి వెళ్ళనుండగా, అక్కడ దొమ్మీలూ అవీ జరగవచ్చునీ, ఎవరినైనా తెలిసిన పెద్దవాళ్ళను పట్టుకొని కూడా కూడా తిరుగుతుండమనీ, అమ్మ హెచ్చరించినట్టు బాగా జ్ఞాపకం.

పోతే స్పష్టంగా గుర్తున్నది అమ్మవారి గుడి వద్ద గరిడీ రంగం.

మా ఊరుకూ, పొరుగుపేటకూ పొలిమేర వద్ద విశాలమైన ఒక సమ ప్రదేశంలో జన సమూహం బాగా కూడి ఉన్నది. నే వెళ్ళేసరికే మర్కట సాంప్రదాయాలను ఇంకా విడవనేరని మానవ సముదాయంతో సమీపస్థములైన చెట్లూ, చేమలూ, విరగకాచిన మామిడి గున్నలలా వంగి ఊగిసలాడుతున్నాయి. చచ్చీ చెడీ నేనూ ఒక చెట్టుమీద కాస్తంత చోటు చేసుకున్నాను.

కొందరు పెద్దలు ఆసరికే జనం నడుమ కడియం ఏర్పాటు చేస్తున్నారు. జనం పావుగంటకు పైగా తొక్కిసలాడి చివరి కెట్లానో కావలసిన మేరకు చోటు పెట్టారు.

గరిడీల గురించి నాకంతకు ముందే కొంత తెలుసనుకుంటాను. నా గుండెలలో అప్పటికే కొంత దడ ప్రారంభమయ్యింది. అయినా అక్కడ చేరి ఉన్న జనమేకాక దశ దిశల నుండీ చుట్టుపక్కల గ్రామీణులు, వర్షానంతరం పర్వత సానువుల నుండి కింది లోయలోనికి పారే చిన్న పెద్ద ప్రవాహాలలా, గుంపులు గుంపులుగా రావడం ఒక వంక ధైర్యం కలిగిస్తూ ఉంది. ఆనాటి జనం, ఆ తొక్కిసలాటా, మా ఊరిలో ఇంకెన్నడూ చూసిన జ్ఞాపకం లేదు. రంగు రంగుల దుస్తులూ, తలనూనెలతో కలిసి కారే చెమటలూ, చేపాటి కర్రలూ – శిగముడులూ, కొనకాడలూ, ఓణీలూ, రుమాళ్ళూ, దస్తీ గుడ్డలూ, తలపాగాలూ – గ్రామీణ వస్త్రధారణాలంకరణ వైచిత్రులన్నీ ఉన్న వైవిధ్యం అంతా,

అక్కడ చూడవచ్చు. అంత జనం చేసే ఆ రొదకు అంతులేకుండా ఉంది.

చూస్తూండగానే, ఇరుప్రక్కల నుండీ, కాస్త కాల వ్యత్యాసంతో, ఇద్దరు వ్యక్తులూ దిగారు – గరిడీలోకి.

అటు ఒక నాయుడు. మనిషి అంత ఎత్తరికాడు కాని, భయం కొలుపుతూ ఉంటాడు. తరచైన నల్లటి బొద్దుమీసాలు, భీకరమైన ఎఱ్ఱని పెద్ద కళ్ళు, చేవదేరి నిగనిగలాడే బలిష్టమైన కండరాలు, తలపై పెద్ద శిగముడి, అన్నింటినీ మించి తామసాన్ని విరజిమ్మే పెద్ద ముఖం – అతడి లక్షణాలు.

ఇటు వీరన్న, అది – అతడు మా ఊరివాడనే భావం వల్లనే కలిగిందో లేక బక్కపలచని వీరన్న ఆకారాన్ని నేను బలహీనతగా తీసుకోవడం వల్లనే కలిగిందో స్పష్టంగా యిప్పుడు చెప్పలేను. ఆనాడు నా సానుభూతి మాత్రం పూర్తిగా వీరన్న వంకనే ఉంది.

చూస్తూనే ఉన్నాం. ఎప్పుడు యెట్లా ప్రారంభమయ్యిందో జ్ఞాపకం లేదు. గరిడీ ప్రారంభమయ్యింది. కఱ్ఱలు అంతరాళంలో టకటకమంటూ వివిధ తాళగతుల్లో చూపరుల దృష్టులను మోసం చేస్తూ కలియడం, మధ్య మధ్య విడివడుతుండటం, ఒడుపులకై తారాడి ఉవ్వెత్తున దూకివేసి ఎదురొడ్డుకొని జడివాన పాటుగా దండతాడన ధ్వనులు మారుమ్రోగటం – బాగా జ్ఞాపకం ఉంది. చివరికొక పరిస్థితిలో జనం ఘొల్లుమన్నారు.

చుట్టూ ఉన్న జనం సుడిగుండంలా మధ్యకు తోసుకుపోవడం, చెట్లమీద వాళ్ళు దభీదభీమని కిందకి దూకి పరుగులు తీయడం, చూసేసరికి – అమ్మ చెప్పిన 'దొమ్మీ' ఆరంభమయ్యిందనుకొని నేను ఒకటే పరుగు పుచ్చుకున్నాను. కొంతసేపు పోయాక నేను పడ్డ పొరపాటును గ్రహించి వెనక్కి వెళ్ళేను. మధ్య కాలంలో ఏమయ్యిందో నాకు తెలియదు. అడిగితే–

అసిరినాయుడు ఓడిపోయాడట. వీరన్న మూడు దెబ్బలు వరసగా చూపి అతణ్ణి పరాజితుణ్ణి చేశాడుట. కాని ఆ ఊరివాళ్ళు ఓటమిని అంగీకరించటం లేదట.

ఆ జనంలో ఆ సందడిలో ఆ ఊరివారూ, మా ఊరివారూ జట్లు జట్లుగా మూగి ఉద్రేకజనితాలైన అభినయాలూ, పెద్ద పెద్ద గొంతులూతో వాదించుకుంటుంటే ఒకపక్క అక్కడ ఉండి అదంతా తెలుసుకోవాలని ఆకర్షణ, వేరొక పక్క భయం. అయితే ఉభయ గ్రామాల పెద్దల ధర్మమా అని దొమ్మీలేవీ జరగలేదు.

ఆరోజల్లా మా ఊరి జనం తమ ప్రతిష్ఠ నిలిచిందని అంతరంగంలో ఎంత సంతసించారో, దానిని నిలిపిన వీరన్నను బయటకు అంత పొగిడారు.

ఆనాడేమిటి – మరునాడూ, మూడోనాడూ ఇంచుమించు పదిరోజుల వరకూ ఊళ్ళో ఇంకొక ప్రసంగమన్నది లేదు. రచ్చరాయి వద్ద, రామ మందిరం వద్ద, ఎగువవీధిలో, సంగిడీల దిబ్బపై – ఎక్కడ విన్నా వీరన్న నైపుణ్యాన్నీ, గ్రామ ప్రతిష్ఠకు అతడు చేకూర్చిన మహా విజయాన్నీ, అందుకై వీరన్న చేసిన మహత్తర కృషినీ గూర్చిన ప్రసక్తే. విన్నవారికి విసుగుపుట్టే వరకూ సాగిందది.

ఇదీ వీరన్నను నాకు పరిచితుని చేసిన సంఘటన.

ఆరోజుల్లో వీరన్ననూ, వీరన్న సేవనూ, కృషినీ గూర్చి పొగిడిన వారు వాటన్నిటి విషయం ఇంకొక నాటికి మరచిపోయినా, ఆరోజుల్లో వారు తమ అనూనవాక్య రచనచే ఆనాటి నా పసి హృదయంలో ఘటించిన వీరన్న పరిచితి మాత్రం నాటికీ నేటికీ స్థిరంగా నిలిచిపోయింది. ఆ సందర్భాలలో వారు వినిపించిన వీరన్న పూర్వచరిత్రను కూడా నేనెన్నడూ మరవలేదు. వారు వేసిన పునాదులపైననే నేను తరువాత తరువాత విన్న దానినీ, కన్నదానినీ చేర్చి వీరన్న చరిత్ర సౌధం నిర్మించుకుంటూ వచ్చాను. అమ్మ నేడు వినిపించిన చరమాధ్యాయంతో అది సంపూర్ణమయ్యింది.

కళంకితాంతమూ, దుఃఖావహమూ అయిన వీరన్న జీవిత చరిత్ర వాటితోనే ప్రారంభం కాలేదు. చాలామందికిలానే అతడూ వేలెత్తి చూపించుకొనని కుటుంబంలోనే పుట్టాడు. నోటికీ, చేతికీ ఎడంలేని కుటుంబంలోనే పుట్టాడు.

కులంచే అతను సాలె. తండ్రికి ఒక్కడే కొడుకు. తల్లి లేదు. అతడి తండ్రి కులవృత్తి చేతే జీవిస్తుండే వాడు. ఆసరికే యార్క్‌షైర్, లాంకాస్టర్ మిల్లుల రాక్షస హస్తాలు భారతదేశంలో నాలుగువంకలా లక్షలాది తంతు వాయుల నోటిముందరి ముద్దలు ఒడుచుకు పోనారంభించినా, యీ మారుమూల పల్లెల వరకూ అవి సాగి ఉండలేదు. అందుచేత వీరన్న తండ్రి కాలంలో వారికా వృత్తి వల్ల బాగానే కిట్టుబాటయ్యేది. తిన్నది శాల్యాన్నాలు కాకపోయినా, ఉన్నది మహాభవనాలు కాకపోయినా కూటికీ, కొంపకూ లోటు లేకుండా ఉండేది.

వీరన్న తండ్రిని పరమ ధార్మికుడని చెప్పుకునే వారు. వృత్తి ధర్మ రీత్యా మంచి పనివాడు. గొప్ప పట్టుదలా, ఓపికా ఉన్నవాడు. వీరన్నలో ఆ లక్షణాలు ఒక్క సాము నేర్చుకోవడంలో తప్ప ఇంకెందులోనూ కనిపించవు. తండ్రి ఎంత శాంతుడో కొడుకంత దుందుడుకు. తామసి కాకపోయినా రాజసం ఎక్కువ. అయినా విద్యావంతుల ఎడ ఎంతో వినయవంతుడన్నారు – అతడి స్వభావం గురించి.

ఇంక చదువు సంధ్యల విషయమంటే – ఆరోజుల్లో పల్లెటూళ్ళలో – అందులో ఆ కుటుంబాల వారికి – చదువు నిరుపయోగమైనది. అందుచేత, వీరన్నకు బడి ముఖమైనా తెలియదంటే వింత లేదు. పోతే – చెప్పవలసేది, అతడు కుల విద్యను కూడా అశ్రద్ధ చేశాడు.

అంతరాంతరాల్లో ఏమనుకున్నా బయటకు మాత్రం ఆ

తండ్రి ఇట్లా అనేవాడట–

"చెట్టంత కొడుకును ఇంట పెట్టుకొని, ఏనుగును మేపినట్టు మేపుతూ, అంచు నేతకు కూలీలను పెట్టమంటే, మధ్య నాకు తలవంపుగా వుందిరా! అనుభవిస్తావులే! నేను బతికి ఉన్నంతకాలం నువ్వు ఇంతే. నేను హరీమన్నాక గాని నీకు తెలియదు. అప్పుడు నీ పాట్లు కుక్కలూ, నక్కలూ పడవు".

గ్రామీణులు వీరన్నను గురించి తమ లోకాభిరామాయణాల వేళ యీ జోస్యాన్ని స్మరించి ఆశ్చర్యాన్ని ప్రకటించినా అందులో వింత ఏమీ లేదు. బాల్య యవ్వనాలలో బేఖాతరుగా తిరిగిన వాళ్ళు ఎంతటి ఇంట బుట్టినా కౌమార వార్థక్యాలలో కష్టపడక తప్పదు. ఇది సహజం.

బాల్య యవ్వనాలలో వీరన్న దినచర్య ఇంచుమించు ఇట్లా ఉండేదిట.

తెల్లవారుజామునే లేచి కాలకృత్యాలు తీర్చుకొని సంగిడీల దిబ్బ మీద తన వంటిబాపతే మరికొందరితో కలిసి కసరత్ చేయడం మొదటి పని. తరువాత సాము. జాము ప్రొద్దువేళ మస్తుగా చల్దన్నం తినటం. పశువులను మందకు తోలే వరకూ రచ్చరాయి దగ్గర బాతాఖానీ. తరువాత ఋతువులనుబట్టి, ఫలహారాపేక్షతో, ఊరిలోని ఒక కిష్కింధ సైన్యంతో తానూ చేరి, ముంజకాయలకై తాటి తోపులకో, పండ్ల కోసరం జీడి తోటలకో, లేక దగ్గరి అడవికో, విహారం సేవించి అపరాహ్నవేళ ముద్దకై ఇంటికి చేరుకోవడం. గాలిపటాల దినాలైతే – మధ్యాహ్నమల్లా గాలిపటాలు ఎగరేయటం. లేకపోతే గోణీ బిళ్ళాటో, గొట్టికాయలాటో, బచ్చీలాటో ఆడుకోవటం. సాయంకాలం మళ్ళా సామూ కసరత్. రాత్రి రామమందిరం అరుగుల మీద కాలక్షేపం. చివరకు ఏ జామున్నర రాత్రికో ఇల్లు చేరుకోవడం.

ఇది అతడి దినచర్య. పరిస్థితులనుబట్టీ, ఋతువులూ, కాలాలూ భేదాలననుసరించీ, వయస్సునుబట్టీ, ఇందులో కొన్ని కొన్ని మార్పులున్నా – స్థిరములూ తప్పనిసరివీ – సామూ కసరత్, రామమందిరం వద్ద కాలక్షేపం.

ఒక్కొక్క ఊరికి ఒక్కొక్క ప్రదేశం గ్రామ కేంద్రంగా ఉంటుంది. ఊరిలో తీరికున్న వారందరూ, లేక తీరిక చిక్కించుకున్న వారందరూ అక్కడకు చేరుకుంటారు. మా ఊరిలో అట్టిది రామమందిరం.

రామ మందిరం గ్రామ కేంద్రం కావటానికి కారణం – అది ఉమ్మడి కట్టడం కావటమే కాదు – మా గ్రామపు ప్రత్యేక పరిస్థితుల ప్రమేయం కూడా ఉంది.

ఊరు గ్రాండ్ ట్రంక్ రోడ్‌ను ఆనుకొని ఉండటం వల్ల ఆ పూర్వపు రోజుల్లో బాటసారులు అప్పుడప్పుడు మా ఊరిలో ఆగిపోవడం కద్దు. ప్రక్కనే ఉన్న పాతసత్రవులో వంటలు వండుకొని తిని యీ మందిరంలో నిద్రపోతూ ఉండేవారు. వార్తాపత్రికలూ, ప్రయాణ సౌకర్యాలూ ఇప్పటంత ముమ్మరంగా లేని రోజుల్లో యీ బాటసారులే పల్లెల్లో వార్తా పత్రికలుగా, కథల పుస్తకాలుగా నడచి వచ్చిన పుణ్యక్షేత్రాలుగా ఉపయోగపడే వారు. రామమందిరం గ్రామ కేంద్రం కావటానికి ముఖ్యమైన హేతువు వారి రాక పోకలేనని చెప్పాలి.

ఇక్కడ ఆ బాటసారులు ఆయా ప్రదేశాలలో విన్న, విన్నామన్న, వింతలూ విశేషాలూ భోగట్టాలూ వర్ణించేవారు. చూసినవి చూసినట్టు చెప్పగా, విన్నవి కూడా చూసినట్టే చెప్పేవారు.

గ్రామంలో ఉబుసుపోని వారందరూ – ముఖ్యంగా కౌతుకం ఒక మోతాదు ఎక్కువగా కలవారు – పొద్దుపోగానే కలిగిన కాడికి పొట్టలో వేసుకొని, తలగుడ్డలో దుప్పట్లో సద్దుకుంటూ, నోటిలో కణకణ వెలిగే చుట్టలతో, ఒక్కొక్కరే యీ కేంద్రంకు చేరుకునే వారు. వీరంతా ఆశ్చర్యచకితులై 'ఊఁ'లు 'ఊహూ'లు 'అబ్బా!'లుతో హంగుచేస్తూ ఉంటే – చెప్పేవారు అంతూ ఆపూ లేకుండా, గంటల తరబడి, దాదాపు అందరికీ నిద్దర్లు వచ్చేవరకూ, తమ తమ కల్పనా చమత్కృతికి వాక్చమత్కృతిని జోడించి, విషయాలు అల్లి విడదీసి చెప్పేస్తూ ఉండేవారు. ఈ శ్రోతలలో కాస్త నాలుగు ఊళ్ళు తిరిగిన వారు కూడా, అవి సత్యాలని తాము నమ్మకపోయినా, మానవ సహజమైన తమ కౌతుకాన్ని తృప్తి పరచుకునేందుకు, అన్నీ నమ్మినట్టు వింటూ వస్తే – వీరన్నలా, ఎన్నడూ ఊరు విడవని వారు వాటిని అక్షర సత్యాలుగా గ్రహించి ఊరుకొనేవారు.

ఉపన్యాసకులుగా ఒక్కొక్కప్పుడు సాధు సజ్జనులు దిగేవారు. వారు – మంత్రతంత్రాలూ, భూత ప్రేత పిశాచాదుల గురించిన కథలూ, సర్వపుణ్యక్షేత్ర వర్ణనలూ, జన్మ పునర్జన్మాది పరలోక విషయాలూ వివరించే వారు. వీనిని – పైన చెప్పినట్లు – నమ్మని వారు కూడా నమ్మినట్లు నటించగా, ఏమీ తెలియని వారు పూర్తిగా నమ్మేవారు.

ఇట్లా సత్కాలక్షేపానికి అక్కడ అవకాశాలు ఎక్కువ ఉండటంచేత రాత్రులు అక్కడ చాలామంది చేరేవారు. ఒకవేళ ఒకనాడు అట్టి వారెవ్వరూ లభింపకపోయినా కొరత ఉండేది కాదు. ఒక తాత ఉండేవాడు. అతడు కూడా నిత్యం అక్కడకు చేరుకునే వాళ్ళలో ఒకడు. అతడు చెప్పిన కథ చెప్పకుండా ఏళ్ళ తరబడి కథలు చెప్పగల సమర్థుడు. అతడి కథలతోనైనా అక్కడ కాలం గడిచేది.

ఇవికాక ఆ ఊరివీ పై ఊళ్ళవీ భోగట్టాలూ, ఎవరెవరి చిన్ననాటి గాథలూ, పూర్వకాలపు ముచ్చటలూ కూడా మంచి కాలక్షేప వస్తువులుగానే ఉపకరించేవి. పైగా ఇట్టి సందర్భాలలో మాట్లాడేవారి తాహతునూ సామర్థ్యాన్నీ బట్టి – నవ్వీ, నవ్వించీ, ఏడిపించీ, భక్తి శ్రద్ధలతో గౌరవించీ, ఆనందించటానికి కూడా అక్కడ ఎంతో అవకాశం వుండేది. అందుచేతే చాలామందితో పాటు, వీరన్న కూడా ఏది తప్పినా

ఇది తప్పదన్నట్టు నిత్యం ఇక్కడకు హాజరయ్యేవాడు.

సువిశాలమూ, వివిధ చిత్ర విచిత్ర నదీ నగ సాగర ప్రదేశ సంశోభితమూ, బహువిధ భాషా సాంప్రదాయ సంస్కార స్వభావ జనసంయుతమూ అయిన యీ ప్రపంచం గురించీ, ఇందలి తదితర అనంతకోటి జీవరాసుల గురించీ, మహాత్ములూ, మహానుభావులూ, మహామేధానిధులూ అనిర్వచనీయుడని పేర్కొని విడిచిన ఏతత్సృష్టికర్త గురించీ, అన్వయ క్లిష్టమైన మానవ జీవితం గురించీ, కూడా వీరన్నకు – అవి కుంటివో గుడ్డివో సత్యసమ్మతాలో సత్యదూరాలో ఎలాంటివైనా అభిప్రాయాలంటూ కొన్ని ఏర్పడి ఉంటే అవి – ఇక్కడే, ఈ మహా విజ్ఞాన వేదిక వద్దే, బాధ్యతా బాధ్యతలూ, జ్ఞానాజ్ఞానాలూ మొదలైన ద్వంద్వాల కతీతులైన యీ బాటసారి గురుదేవుల పాదాల ముందే ఏర్పడి ఉంటవన టానికి సందేహం లేదు.

ఈ విజ్ఞాన వేదిక వీరన్న లోకజ్ఞానాన్ని విస్మృత పరచడమేకాక అతడి అభిమాన విద్యకు మెరుగులు దిద్దుకునేందుకు కూడా ఉపయోగపడేది.

ఒక్కొక్కప్పుడు వీరవరుల ప్రసక్తి కూడా వచ్చేది. సాము నేర్చినవాడు ఆరేడు ఆమడల నడుమ ఎక్కడ ఉన్నాడన్నా, తాత్కాలికంగా వచ్చి ఉన్నాడని విన్నా వీరన్న తన బాణా తీసుకొని బయలుదేరేవాడు. తన ప్రజ్ఞ చూపి మెచ్చికోలు పొందో, తెలియని మెళుకువలు తెలిసికొనో తిరిగి వచ్చే వాడు.

ఈవిధమైన పరిశ్రమ అతడికి పాతిక ముప్ఫై ఏళ్ళు వచ్చేవరకూ సాగింది. అక్కడకు అతడు కళ్ళు విచ్చిన రోజులుకూడా ఎంతో ఎడం కావు.

లోకమెలాంటిదంటే – చిత్రమైనది. దానిపై నిందారోపణ చేసే ప్రయత్నం నేను చేయబోవటం లేదు. దాని యదార్థ నైజాన్ని నేను గ్రహించిన మేరకు వివరించడమే నా తాత్పర్యము. నా యీ ప్రయత్నాన్ని మీరే విధంగా అర్థం చేసుకున్నా దానిని దోషిగా నిరూపించే ఉద్దేశం నాకు లేదు.

లోకం కొన్ని విషయాలలో పిల్లీ – కోతీ – జీడిపిక్కలూ కథలో చిత్రించబడ్డ కోతి లాంటిది. కొన్నిరకాల ఆనందాలు పొందటానికి, మరి కొన్ని కష్టనష్టాలు కూడా తను ఎదుర్కోవలసి ఉంటుందంటే, ఆ ఊబిలోనికి తాను మాత్రం స్వయంగా దిగదు. అయితే – ఆ ఊబినీ, దానిలో దిగేందుకు సాహసించే వారినీ ఊరికెనే తెగ పొగుడుతుంది. దమ్మిడీ దండలేని యీ పొగడ్తలను ఎడాపెడా ఖర్చు చేయటంలో అది నష్ట పోయేదేమీ ఉండదు. కాని, మూర్ఖులైన ప్రజ్ఞావంతులు కొందరు, ఈ రహస్యం గుర్తించలేక, తమ ప్రతిభనూ అమూల్యమైన కాలాన్నీ, జీవితాన్నీ కూడా యీ మెరమెచ్చులమీది లోభంతో దుర్వ్యయం చేస్తూ వస్తారు. చివరి కొకనాటికి ఆ నిర్భాగ్యులు యీ శుష్క ప్రశంసల నుంచి కూడా వంచింపబడతారు. ప్రజలు, అన్యుల కష్టనష్టాల నుండి లభించే యీ ఆనందంతో ఒకనాటికి మొహం మొత్తేయడం వల్లో, లేక అంతకుమించిన సమర్థుడింకొకడు తారసిల్లటం వల్లో, అదీ కాకపోతే అభిరుచులు మారటం వల్లో, లోగడ తామిచ్చిన ప్రశంసలతో పాటు ఆ ప్రశంసితులను కూడా మరచిపోతారు.

ఇది లోక పరిపాటి.

ఇట్టి విషయాలలో అన్నిటినీ మించిన దురదృష్టమేమంటే – అన్నిరకాల జూదగాండ్రకులానే, ప్రజాగౌరవ సంపద నపేక్షించి సమస్తం ఒడ్డి ఓడిపోయే యీ జూదగాండ్రకు కూడా కడవరకూ కన్నులు విడవు. ఒకవేళ విడివడ్డా, ఆ అదటుకు పగిలే గుండెలు కుదుటపడటానికి సాధారణంగా ఒక జీవితకాలం పడుతుంది.

వీరన్న విషయంలో కూడా ఇదే నిజమయ్యింది.

తన జీవిత పథ నిర్దేశ విషయంలో జరిగిన పొరపాటును గుర్తించ వచ్చేసరికి అతడొక ఎడారి నడుమ ఉన్నాడు. ఆ దెబ్బనుండి అతడు కోలుకునేసరికి మళ్ళా ఇరవై ఏళ్ళు పట్టాయి. అప్పుడైనా అందులో అతడి ప్రమేయం తక్కువ. పరిస్థితుల ప్రాబల్యమే అతడిని మరలా సజీవుడైన మానవుణ్ణి చేసింది.

తండ్రి బతికి ఉన్నంతకాలం అతడన్నట్టు వీరన్నకే చింతా లేకపోయింది. చనిపోతూ కూడా ఆ ముసలివాడు తన పాలుమాలిన సుపుత్రుని కోసం వేయగలిగినంత కూడవేసి పోయాడు. దానితో కొంత కాలం నిష్పూచీగా గడిచింది. ఆ తరువాత అతని జీవితంలో కొత్త అధ్యాయాలు ప్రారంభమయ్యాయి.

ఆనాటికి వీరన్న జీవితపు జమాఖర్చుల చిట్టా చూస్తే –

జమలలో స్పష్టంగా కానవచ్చేవి – అతడు అంతవరకూ కొండో గోపురమో అని భావించి నిరంతరాయమైన కృషితో సాధించిన ఘన విద్య ఘన విద్యేమీ కాదనీ ఒకవేళ అయినా నిర్వీర్యులైన ప్రజలు దాని గొప్పదనాన్ని గుర్తించే స్థితిలో లేరనీ, కొత్తగా వీరన్నకు ఏర్పడుతున్న జ్ఞానం; మూలను చేరిన బాణాకర్ర మీద కొత్త కొత్తగా చేరుతున్న బూజు, అతడాసరికి కన్న నలుగురు పిల్లలు; కొత్తగా సంపాదించిన రెండో భార్య.

ఇంక ఖర్చులలో – ఉన్న ఇల్లు మినహాయించి తండ్రి గడించి యిచ్చిన ఆస్తిలో ఆఖరు పైస. అదికాక అంతకెన్నో రెట్లు విలువచేసే జీవనోత్సాహం.

దారిద్ర్య రేఖ నట్టింట పాదంపెడితే వచ్చే మార్పులను గురించి వేరే చెప్పనవసరం లేదు. అయితే ఒక్కో అప్పుడు ఒక్కొక్కచోట కొంత మంచి కూడా దానివల్ల జరుగుతుందేమో.

వీరన్న ఆదిని తండ్రి కట్టబెట్టిన భార్యతో తృప్తిపడక మధ్యను ఇంకొకా మెను తీసుకవచ్చాడు. ఒకవిధంగా ఆమె అతడి కీర్తికాంతకు చిహ్నామన వచ్చును. ఆమె తనంత తా వలచి వచ్చిన కాంత. భర్త పోగా, చాలా కాలం వరకూ

వైధవ్యాన్ని నిష్ఠతో పాటించి, ఒకనాడు అత్తవారింటి ధన సంపదలతో పాటు చుట్ట పక్కాలనూ, పరువు ప్రతిష్ఠలనూ కూడా విడచి వీరన్న సజ్జను చేరింది. మొట్టమొదట ఆమెను ఇంటికి తెచ్చిననాడు తొలి భార్య సహజంగా గోలచేసి తగువు పెట్టింది. ఈ తగువులో పెడసరపు వీరన్న మొండి జవాబులకు అలిగి, ఊరిపెద్దలూ, ప్రజలూ వెలివేస్తామనీ, కొడతామనీ బెదిరిస్తే మళ్ళా ఆ లలనామణే, మొగుడు అటకమీద బూజు పడుతున్న బాణాకర్రను తీయబోతూ ఉంటే, ఆవి, అసహాయగా నిరస్త్రయై వీధినపడి తిట్లకు దిగేసరికి ఊరి ఊరందరూ అపరాధపు లెంపలేసు కున్నారు.

ఆ సవతీ ఏరాళ్ళిద్దరూ మొదటల్లా గంగా గౌరులని పేరువోసినా కష్టకాలం వచ్చేసరికి ఒక్కటయ్యారు. ఎప్పటికప్పుడు కూడబలుక్కుంటూ కొంతకాలం వ్యష్టిగానూ, మరికొంతకాలం సమిష్టిగానూ, మామగారు ఆశలుడుపుకొని విడిచిపోయిన బృహత్కార్యాన్ని తాముగా సాధించడానికి ప్రయత్నం చేశారు. కాని వారి కన్నీళ్ళూ ఎత్తి పొడుపులూ చివరకు తిట్లు కూడా వీరన్నపై పనిచేయకపోగా ఇంకో గత్యంతరం కనిపించక భార్యాత్వానికి స్వస్తిచెప్పి భర్తృత్వం నెరపసాగారు.

వీరన్న వర్గానికి చెందిన కుటుంబాలలో జరగనప్పుడు ఆడవాళ్ళు కూలి చెయ్యటం నామోషీ కాదు. అందుచే ఆ ఆడవాళ్ళిద్దరూ, పని దొరికినప్పుడల్లా కూలిచేసి, వట్టి రోజుల్లో రాట్నాలపై నూలుతీసి, పిల్లలతో పాటు వీరన్నను పోషిస్తూ రాగా – ఆ మగవాడు అమరినకాడికి మస్తుగా తిని, కొత్తగా నెలకొన్న దుకాణంలో మధ్య మధ్య టీ తాగుతూ, అందులోనే ఒక వారకు వున్న షాపునుండి అరువుకి కారాకిళ్ళీ సంపాదించి నములుతూ, వీడి మగతనం గురించీ, వాడి ససవతనం గురించీ, ఆ కాలపు కుర్రాళ్ళ చవటతనం గురించీ, తమ రోజుల్లో మనుష్యుల దారుఢ్యాల గురించీ అక్కడ జరిగే విమర్శల్లో పాల్గొంటూ జర్మనీవాడి అసాధ్యతా, జపానువాడి తెలివితేటలూ, బ్రిటిష్‌వాడి కుటిలత్వం, గాంధీగారి మహత్మ్యం ఆదిగా గల ఆనాటి రాచకీయాలకు సంబంధించిన కట్టుకథలు ఆలకిస్తూ కాలం గడుపుతుండే వాడు.

ఊరివారు వీరన్న ఇంటివరసలోని అసందర్భాన్ని గుర్తించినా ఎన్నడూ అతడిని ప్రశ్నించరు. తొలి భార్య నారాయణే ఎప్పుడేనా అనేది.

"సిగ్గు లేదా..... సిగ్గు! మగవాడంట............ మగవాడు!" అనేది.

ఈ యీసడింపు వీరన్నకు కోపం తెప్పించేది కాదు. నవ్వుతూ "నేను మగవాడినౌదునో కాదో నువ్వెరుగుదువు జగమెరుగును" అంటూ అనుదాహరణీయమైన మాటలతో ఆమెకు వాగ్బంధం చేసేవాడు. ఒక్కో అప్పుడు–

"నీకెందుకా దుర్బుద్ధి, మధ్యమధ్య పైత్యం తిరగేసినట్టు, తిరగబెడతాది! నువ్వు కాదు ఆ పరమేశ్వరుడైనా నన్ను మార్చలేదు. నువ్వు కోరిన వ్రాలు ఆ బ్రహ్మదేవుడు నా నుదుట రాయలేదు. ఈ జన్మకింతే నువ్వెంత తన్నుకు చచ్చినా నాచేత కూలిపని చేయించలేవు" అనే వాడు.

ఆ సమయాన అతడి ముఖాన తాండవించే నైరాశ్యం, గొంతులో వినవచ్చే ఆవేదనా గమనిస్తే నారాయణిదే కాదు, ఎవ్వరిదైనా గుండె కరిగి కాలవ కట్టవలసిందే.

అయితే యీ విరక్తుడు కూడా ఒకనాటికి రక్తుడయ్యాడన్నది లోకం. అంటూ అతడి నెత్తిమీద నిందల భారాన్ని పదిలంగా ఎత్తిపెట్టింది.

గత రెండు దశాబ్దాలలో గుర్తింప రానంతగా మారే ప్రపంచంలో మారే మన దేశంతో పాటు మానాడూ మా గ్రామం కూడా చాలా మారి పోయింది.

ఆదిని మా గ్రామం మీంచీ ఉదయం ఒకటీ, మధ్యాహ్నం ఒకటీ రెండే బస్సులు పోయేవి. ఆ రెండు నాలుగయి, నాలుగు మూడై, మూడు ఆరూ, పదీ పదహారుగా పెరిగి పెరిగి యిరవై అయ్యాయి. ఇప్పుడు మా వారెవ్వరూ నాలుగుమైళ్ళ దాపున ఉన్న పొరుగూరికి కూడా నడిచిపోరు. పావలాపెట్టి బస్సుమీదే పోతారు.

బజారులో పకోడీ వంటి పదార్థాల దర్శనం సంవత్సరంలో ఏ ఒక్క రథోత్సవ నాడో తప్ప ఎరగని మా ఊరు ఇప్పుడు నిత్యం సమస్త రకాల పలహారపు దినుసులతోనూ సర్వకాల సర్వావస్థలలోనూ పరిమళిస్తుం టుంది. బీడాబిక్కీతో నాలుగు వందల గడపైనా లేని మా గ్రామంలో ఇప్పుడు దగ్గర దగ్గర పది వరకూ కాఫీ హోటళ్ళున్నాయి. ఇందులో ఒకటి పుట్టి పద్దెనిమిదేళ్ళయ్యింది. ఇంకొకటి పదిహేనేళ్ళ క్రితం పుట్టింది. ఇంకో రెండింటి వయసు కూడా పదేళ్ళకు పైనే. ఇవికాక నాలుగైదు కిళ్ళీ కొట్లూ, ఒక ఫ్యాన్సీ షాపూ వచ్చాయి.

ఇప్పుడు మా ఊళ్ళో కాఫీయో, టీయో, కిళ్ళీయో అలవాటు లేని మనిషి అతి ప్రయాసపడి వెతికితే గాని దొరకడు. అక్కడకు పట్నం పది మైళ్ళు. సినీమా నెపంతో వారానికొక్కసారైనా పట్నం పోయి వస్తే గాని బతకలేని వాళ్ళు డజన్లకొద్దీ ఉన్నారు.

రెండవ ప్రపంచ యుద్ధంనాటి కంట్రోళ్ళూ, ద్రవ్యోల్బణం ఫలితంగా నైతేనేం, స్వాతంత్ర్య సిద్ధ్యనంతరం ప్రవేశించిన స్థానిక పరిపాలనా నగర సంబంధాల వల్లనైతేనేం, యీవిధంగా జీవితావసరాల పద్దుల్లో అనవసరమైనవి కూడా చాలా చేరి పోయాయి. పచ్చగడ్డి నుండి బంగారం వరకూ సమస్త పదార్థాల ధరలూ పెరగడమే కాని తరగడం ప్రసక్తి లేదంటున్నాయి.

ఈ ఆర్థిక సంక్షోభంలో కొంత కాలం వరకూనైనా కటకటలాడని కుటుంబం ఉన్నత తరగతికి చెందినదైనా

లేదంటే ఇంకా బీదా బిక్కీ మాట తడవనవసరం లేదు.

బీదవారి ఆహారంలో, వస్త్రధారణలో, వృత్తుల్లో ఎన్నో మార్పులూ, వెర్రితలలూ, అంతరాయాలూ, కొత్త పద్ధతులూ ప్రవేశించాయి. కందులూ, పెసలూ, ఉలవలూ ఆదిగా గల సమస్త కాయధాన్యాలనూ బియ్యంతో సమానంగా వాడటం నేర్చుకున్నారు. జరగని వారు కొందరు ఊరు విడిచి పట్టణాలకు పోయి రిక్షాలాగటం ఆరంభిస్తే మరి కొందరు బియ్యం, పంచదార మొదలైన కంట్రోలు వస్తువులు చీకటి బజారు ధరలకమ్మీ దొంగ రవాణాలో సాయపడీ జీవించసాగారు. ఇంకా కొందరు వంటసారా వ్యాపారం, దొంగతనం ఆదిగా గల సాహస వృత్తులవలం బించారు.

ఆరోజుల్లోనే - అందులో నిజమెంతో అబద్ధమెంతో చెప్పటానికి నాకు ఆధారాలు చాలవు గాని - లోకం వీరన్న జీవితానికొక కళంకంతో ముడిపెట్టింది.

నేను మా ఊరు విడిచి ఆసరికే చాలా కాలమయ్యింది. కాగా యీ నాడు నా తత్వమెలాంటిదంటే - కళ్ళతో చూసి గ్రహించే దానిలో కూడా మూడు వంతులు అసత్యం ఉండడానికి అవకాశం లేకపోలేదు అనుకునే ధోరణి. అందుచేత ఇదమిద్ధమని యీ విషయమై నేనేమీ తేల్చలేకండా ఉన్నాను. విన్నది మాత్రం - చివరి రోజుల్లో వీరన్న పొట్ట పోషించుకోడానికి చోర వృత్తి అవలంబించాడని. ఆదిలో గింజా గట్రా దొంగతనం చేశాడన్నారు. తరువాత రాత్రుళ్ళు పొరుగూళ్ళలో దొంగతనాలు చేసి వస్తున్నాడన్నారు. రెండేళ్ళలో - అతనికి కొందరు గజదొంగలతో భాగస్వామ్యం వున్నదన్నారు.

లోకం సంగతి మన మెరగంది కాదు. అయినా అందుకు వాళ్ళు చూపే కారణాలంటూ కొన్ని లేకపోలేదు.

మొదటిది - కూలీ నాలీ లేకపోయినా వీరన్న కుటుంబం జీవనం చేస్తున్నది. రెండవది దిబ్బడితో స్నేహం. దిబ్బడు ఒకప్పుడు వీరన్న శిష్యుడైనా వాడు జైలుకు వెళ్ళి వచ్చిన గజదొంగ. మూడవది అతడు అప్పుడప్పుడూ రాత్రులు ఇంటివద్ద కనపడక పోవడం, ఆలస్యంగా రాత్రులు తిరిగి రావడం.

ఆ అపప్రథను గూర్చిన సత్యాసత్యాలు తర్కించదలచి, అవకాశాలు విమర్శిస్తే, అవి కూడా వీరన్నకు ఎదురు తిరిగే కనిపిస్తవి.

అంతకు రెండేళ్ళ క్రితం నిండు పదిహేనేళ్ళు పెంచిన చెట్టంత కొడుకు అకస్మాత్తుగా కన్నుమూశాడు. పర్యవసానంగా వీరన్న వ్యక్తిత్వంలో పెనుమార్పు కనిపించింది. దేశ పరిస్థితికి తోడు స్థానికంగా వర్షాభావం. దుర్భిక్షంలో అధిక మాసంలా దొరికే కూలీ నాలీ దొరకకుండా పోయాయి. అరవై యేళ్ళు వచ్చాక చదవ నేరుస్తానన్నా నూలు కంట్రోలు దినాలు కాబట్టి కులవృత్తి సాధ్యంకాలేదు. ఈ పరిస్థితులన్నీ గమనిస్తే మనిషి ఏ తప్పుదారి తొక్కినా తొక్కవచ్చనే అనిపిస్తుంది.

పోతే ఆ అపప్రథను ఖండించడానికి రెండే రెండు బలహీనమైన యుక్తులు కనిపిస్తాయి. ఒకటి - అతడేదైనా అకృత్యం చేస్తూ ఉండగా కన్నారా చూసినవారు ఇంత వరకూ ఎవ్వరూ లేరు. అటువంటి వాడు ఎంత కష్టదినాలైనా యింతటి అకృత్యానికి దిగజారుతాడా అన్నది - రెండవది.

లోకం మాత్రం అతని ముసలిముఖాన ఆ కళంకాన్ని నిశ్శంకగా అలిమేసింది. అంతేకాదు, అతని అంతిమయాత్రకు కూడ ఓ కళంకాన్ని అంటగట్టే చెప్పుకుంది.

అతడు చనిపోయేనాటికి మూడు రోజుల ముందు - వరసగా రెండు రోజులు ఊళ్ళో కనిపించలేదట.

మూడోనాడు అర్ధరాత్రి దాటేక, మూడవజాము చివరనో, నాల్గవ జాము మొదటనో, వీరన్న ఇంటి తలుపు దబదబ బాదడం వినిపించింది. ఎవరని లోనివారు అడగ్గా ఎవరిదో కొత్త గొంతు వినిపించిందట. తలుపు తీసిన క్షణం సేపటికి వీరన్న మొదటి భార్య ఆర్త స్వరంతో "ఓయి నాయనోయ్..." అంటూ ఏడవబోయిందిట. ఎవరో చప్పున నోరు మూసి నట్టున్నారు. తరువాత అంతా గుపుచుప్.

ఇలా జరిగిందన్న మూడవ రోజు తెల్లవారుజామున - 'అయ్యో... నా రాజా!' అంటూ వీరన్న భార్య గొల్లుమన్నాక గాని యీ విషయాలు బయటకు పొక్కలేదు. పొక్కాక ఆ సద్యో విధవల శోకాలాపాలకన్నా ఎంతో వేగంగా ఊరంతా ప్రచారమయ్యాయి.

చివరికి వీరన్న భార్య వీధినపడి నోరు చేసుకున్నాక ఊరి పెద్ద లేమనుకున్నారో కదిలి వచ్చారు. ఎవరి మట్టుక వారే ఏమీ తెలియనట్టు చేయవలసిన హంగామా అంతా చేసి చివరకు దహన సంస్కారాలు కూడా ముగించేశారు.

ఈ సందర్భంలో నారాయణి చెప్పిందానికీ, వారింట్లో చెప్పినదానికి పొంతన లేకపోయినా నారాయణి చెప్పిందాన్ని నలుగురూ నమ్మినట్టే నటించారు. వీరన్న అంతకు ముందు ఐదు రోజులనుండే ఉష్ణంతో బాధ పడుతున్నాడట. ఇది యిలా ముంచుకు వస్తుందని వారు కలలో కూడా అనుకోలేదట.

"బుద్ధిమాలిన మొద్దులు! తరువాత దానిని బాధించీ, ఆ పిల్లల్ని వేధించి తెలిసింది కొంత, తెలియంది కొంత చెప్పుకునీ, నోళ్ళు నొక్కుకునే కన్న, ఎప్పుడో దహన సంస్కారాలకి దిగబడ్డ వాళ్ళు శవ సంస్కారాలకే వచ్చి ఉంటే ఆ గుట్టూ మట్టూ అన్నీ అప్పుడే తేలిపోయేవి!" అంటూ ముగించింది అమ్మ.

లోక నిందలూ దాని సందేహాల మాట ఎలా ఉన్నా వీరన్న ఇంక లేదు. సమస్త సుఖదుఃఖాలకూ, కీర్త్యపకీర్తులకూ అతీతమైన మృత్యువు వెనుక అతడు ఏమయ్యాడో ఎక్కడకు పోయాడో ఎవ్వరికీ తెలియదు. అతడి కథ ముగిసినట్టే.

★ ★ ★

వీరన్న చరిత్ర ముగిసింది గాని యీ చరిత్రయేల వినిపించవలసి వచ్చిందీ? ఈ ప్రశ్నకు నేను కొంత సంజాయిషీ యిచ్చుకోవలసి ఉంది.

వీరన్న పడ్డ కష్టాలకు నా హృదయం కదిలిపోయి కాదు. నిజమే అతడు జీవితంలో అనుభవించిన ప్రతి వెన్నెల రాత్రికీ రెండు చీకటి రాత్రులు అప్పు తీర్చాడు. అందుకని మీరూ నేనూ అతడి కుటుంబం కూడా అతడిపై జాలి పడవచ్చు. కాని అతడు మాత్రం తనకై తానెన్నడూ విచారించలేదు. ఇతరుల జాలిని ఆశించలేదు. అందుచేత అది కాదు కారణం.

చరమాంకంలో, అతని జీవితపు ఆఖరి రోజుల్లో వ్యక్తమైన కారుచేదుచే మోహితుణ్ణయ్యా? కాదు. ఒట్టి చేదుకై మింగటం మింగించటం వంటి రసదృష్టికి నేను నోచుకోలేదు.

ఐతే?

వీరన్న పోయాడనటం నిజమే. కాని అతడు మధ్య మధ్య నన్ను మహా వేధిస్తుంటాడు.

ఎప్పుడైనా ఒకనాడు ఒంటరిగా ఉన్నవేళ ముఖ్యంగా రాత్రుళ్ళు కన్నుమూసేవేళ వీరన్న నా ముందు ప్రత్యక్షమౌతుంటాడు. సరిగా అప్పుడే– వీరన్న భార్య అలనాడు ఆ రాత్రి చీకటిలో మందర స్థాయిలో వినిపించిన శోకాలాపం 'రాజా... నా రాజా' అంటూ పదే పదిగా చేసిన పరిదేవనం నా చెవుల్లో మారు మ్రోగుతుంది: ఇంక నిద్దర పట్టదు.

నారాయణీ వీరన్నల బాల్య యవ్వన కౌమారాలూ పిదప కాలంలో కష్టాలూ కళంకం మృతీ – సవ్యాపసవ్యంగా అస్తవ్యస్తంగా జ్ఞప్తికి వస్తాయి. అప్రయత్నంగా – ఆ నిర్భాగ్యుడేమి సాధిద్దామని తాపత్రయ పడ్డాడు! కడకేమి సాధించాడు! అనే ఆలోచనలో పడతాను. అలాంటి సమయంలో అతని మూర్తి కొంత నైరాశ్యం, కొంత విషాదం యీషదభియోద్యోగతా ముఖాన ముప్పిరిగొనగా కానవస్తుంది. తరువాత – విషణ్ణ హాసం చేసే అతడి పెదవులు కదలకపోయినా, నైరాశ్యపు ఛాయలు వెదజల్లే ఆ చూపుల్లో మరే కొత్త భావాలూ పొడసూపకపోయినా, మొత్తంపై అతని మూర్తి నుండే క్రమక్రమంగా విస్పష్టమయ్యే, అభియోగం ఒకటి నా హృదయానికి వ్యక్తమౌతుంది.

అతడిపై నాకు గల సానుభూతిచే ప్రేరేపితుడనై ఆ అభియోగ భారాన్ని ఎవరినెత్తిన వేయటమా అని వెతుకుతాను. అతని తండ్రి, సహచరులు, ఆ రామమందిర గుంపు, ఆ కథల తాత, కబుర్ల రాయుళ్ళ యిన అలనాటి బాటసారులు, తాము చేస్తున్నదేమో తామే ఎరగకుండా ఆదిలో అతడి మృతవిద్యనూ, అతడి స్వల్ప విజయాలనూ మహా ఘనంగా చేసి పొగిడిన గ్రామీణులు – అందరినీ ఒకరొకరుగా సమక్షానికి తెచ్చుకుంటాను. ఎవరికి వారే ఆ అభియోగ భారాన్ని నిష్కర్షగా తిరస్కరిస్తారు.

అంతట, ఇంక గత్యంతరం లేక ఆ మహాభియోగాన్ని నా వర్గానికి చెందిన వారందరి తరఫునా నేనే నెత్తిన వేసుకున్నాను.

అందుచేతే అందుకు నిష్కృతిగా ఏ రసమూ లేని ఆ వ్యక్తి నీరసగాథకు ఇట్లా చరిత్రత్వమిచ్చి సాలె వీరన్నను ఒసెనాపతి వీరన్నను చేసి చివరకు నా చేతలకు నేను జవాబు చెప్పుకోవలసి వచ్చింది.

✷

*(భారతి–1953 ఏప్రిల్)*

*(నేను వెతికిన ఒక నిఘంటువులో సేనాపతి పదం లేదు. కాని సాలీలను సెనాపతులనీ, సేనాపతులనీ వ్యవహరించటం మా ప్రాంతంలో కలదు. ఇతరులు వ్యవహరించటమే కాదు వారు కూడా మీరెవరండీ అంటే సెనాపతులమంటారు.)*